సాక్షి విశాఖపట్నం

శనివారం। 24। ఆగస్టు। 2024


కలెక్టరేట్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ నివాళులర్పించారు. 10లో


దుమ్ము రేపుతున్న 'కమిటీ కుర్రోళ్లు' 10లో


ఆందోళన విరమించిన జూడాలు

వార్డులో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ వైద్యుడు 10లో



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్య ఘటన దేశం మొత్తాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆస్పత్రుల్లో మహిళా వైద్యుల భద్రతపై ప్రశ్నలను లేవనెత్తింది. భద్రత సరే.. సదుపాయాలైనా ఉన్నాయా.. అనే అనుమానాలూ రేకెత్తించింది. ఆస్పత్రుల్లో మహిళా వైద్య, నర్సింగ్ సిబ్బందికి అవసరమైన భద్రత, సౌకర్యాల కొరతపై పలువురు వైద్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. – మహారాణిపేట

వసతులు మెరుగుపర్చాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన చాలా బాధాకరం. ఆస్పత్రుల్లో జూనియర్ నుంచి సీనియర్ వరకూ మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రిళ్లు కూడా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న వసతులు, సౌకర్యాలు మహిళా ఉద్యోగుల అవసరాలు తీర్చలేవు. అందుకే మహిళా వైద్యులు, నర్సులకు ప్రత్యేక రూమ్‌లు కేటాయించాలి. వసతులు మెరుగుపరచాలి. అలాగే రాత్రి వేళల్లో మహిళా వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి భద్రత కల్పించాలి. ఆస్పత్రిలో ఉండే సెక్యూరిటీ, మహిళా పోలీసులను వైద్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ ఆర్.శశిప్రభ, గైనిక్ వైద్యురాలు, విశ్రాంత డీఎంఈ

మహిళా గార్డులుంటే మంచిది



కొన్ని ఆస్పత్రుల్లో నర్సులకు ఎలాంటి సదుపాయాలు లేవు. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు డ్యూటీలో ఉండే నర్సులు ఎన్నో ఇబ్బందులతో విధులు నిర్వర్తిస్తున్నారు. రాత్రి సమయంలో వార్డులో రౌండ్లకు వెళితే ఎటువంటి సెక్యూరిటీ ఉండదు. రాత్రి విధి నిర్వహణలో ఉండే నర్సులకు ప్రత్యేక రూమ్‌లు లేవు. డ్రెస్‌లు మార్చుకోవడానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. మొత్తం బ్లాక్‌ల్లో ఎన్నో విభాగాలు ఉంటాయి. ఈ విభాగాలకు ఒకే ఒక సెక్యూరిటీ గార్డు ఉంటాడు. రాత్రి సమయాల్లో మహిళా సెక్యూరిటీ ఉంటే మంచిది.

– డి.లక్ష్మి, హెడ్ నర్సు, కేజీహెచ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి

న్యూస్‌రీల్

ఆర్మీ ర్యాలీకి ముమ్మర ఏర్పాట్లు


పోర్టు స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లు

మహారాణిపేట : పోర్టు స్టేడియంలో ఈ నెల 26వ తేదీ నుంచి జరగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోజుకు సుమారు 500 నుంచి 800 వరకు అభ్యర్థులు వచ్చే అవకాశం ఉన్నందున.. అందుకు తగ్గట్లు పనులు చేపడుతున్నారు. ఇప్పటికే డైమండ్ జూబ్లీ మైదానంలో బ్యారికేడింగ్, విద్యుత్ దీపాలు, సీసీ టీవీల ఏర్పాటు పనులు పూర్తి చేశారు. పనులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు. అభ్యర్థులు వేచి ఉండేందుకు, ఎంపిక ప్రక్రియలో రిజిస్ట్రేషన్, పత్రాల స్కీనింగ్, ఇతర అంశాల పర్యవేక్షణకు సంబంధించి కౌంటర్లు ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది ఉండేందుకు వసతి ఏర్పాట్లు, మైదానం వెలుపల అభ్యర్థులు క్యూలైన్లలో వచ్చేందుకు వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తూ ఇతర పనులను యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. వివిధ విభాగాల అధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.

16వ బెటాలియన్ కమాండెంట్‌గా మురళీకృష్ణ


బాధ్యతలు స్వీకరిస్తున్న మురళీకృష్ణ

పీఎంపాలెం: బక్కన్న పాలెంలోని ఏపీఎస్పీ 16వ పోలీస్ బెటాలియన్ నూతన కమాండెంట్‌గా కె.వి. మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్‌గా ఉన్న పద్మనాభరాజు ఆయనకు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. మురళీకృష్ణ అనంతపురం ఎస్పీగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. అంతకుముందు ఆయన అనకాపల్లి ఎస్పీగా కూడా పనిచేశారు. బాధ్యతల స్వీకరించిన అనంతరం బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్, క్యూఎం వెల్ఫేర్ ఎంటీ, అడ్మిషన్ కార్యాలయాలను ఆయన సందర్శించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కమాండెంట్ మురళీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.దేవానందరావు, పి.సత్యం, వి.నారాయణ పాల్గొన్నారు.

ఏడీసీపీ(అడ్మిన్)గా రాజ్‌కమల్ బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న రాజ్‌కమల్

విశాఖ సిటీ: ఏడీసీపీ(అడ్మిన్)గా డాక్టర్ వి.బి.రాజ్‌కమల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లాలో అదనపు ఎస్పీ(అడ్మిన్)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈయన ఇటీవల జరిగిన బదిలీల్లో విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో పోస్టింగ్ ఇచ్చారు. రాజ్‌కమల్ గతంలో విశాఖలో పనిచేసిన అనుభవముంది. 2021, 2022లో సౌత్ ఏసీపీగా పనిచేశారు. పలు ముఖ్య బందోబస్తుల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు.

అథ్లెట్ జ్యోతికి నగదు ప్రోత్సాహకం

విశాఖ స్పోర్ట్స్: ఇటీవల ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన విశాఖ క్రీడాకారిణి జ్యోతికి జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం, ఒలింపిక్ సంఘం విశాఖ శాఖ నగదు ప్రోత్సాహాన్ని అందించాయి. స్థానికంగా శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమెకు రూ.30 వేల చెక్కును రెండు సంఘాల ప్రతినిధులు అందజేసి అభినందించారు. విశాఖ నుంచి ఒలింపిక్స్ స్థాయికి జ్యోతి ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ఎదిగిందన్నారు. ఒలింపిక్ సంఘం చైర్మన్ టి.ఎస్.ఆర్. ప్రసాద్, కార్యదర్శి సూర్యనారాయణ, బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధులు, విశాఖ అమెచ్యూర్ అథ్లెటిక్ సంఘం కార్యదర్శి నారాయణరావు, ఒలింపియన్ మాణిక్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఆయన రాకే.. ఓ ధైర్యం


అనకాపల్లి మెయిన్‌రోడ్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



- ఎసైన్షియా ప్రమాదంలో క్షతగాత్రులకు మాజీ సీఎం జగన్ పరామర్శ
- ఆరోగ్య పరిస్థితిపై ఆరా..
- కుటుంబ సభ్యులకు ఆప్యాయంగా పలకరింపు..
- అనకాపల్లిలో ఉషా ప్రైమ్ ఆస్పత్రి వద్ద జననేతను చూసేందుకు ఎగబడ్డ జనం

విశాఖ సిటీ : ఆయన రాకతో బాధితుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాయి. ఆయన ఆత్మీయ పలకింపు కొంత ఉపశమనాన్ని కలిగించింది. అన్నలా.. కుటుంబ పెద్దలా.. వారి బాగోగులు తెలుసుకోవడంతో కొండంత ధైర్యం వచ్చింది. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఉద్యోగులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం అనకాపల్లిలో ఉషా ప్రైమ్ ఆస్పత్రికి వెళ్లారు. ఉదయం 10 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకున్న జగన్‌కు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర వైఎస్సార్ సీపీ నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నేరుగా అనకాపల్లిలో ఉషా ప్రైమ్ ఆస్పత్రికి 11.15 గంటలకు చేరుకున్నారు.

బాధితులకు భరోసా

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరినీ జగన్ ఆప్యాయంగా పలకరించారు. కంపెనీల్లో ఎన్నాళ్ల నుంచి పనిచేస్తున్నారని, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? ప్రమాద సమయంలో జరిగిన పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పరిస్థితులపై ఆరా తీశారు. వారి ఆరోగ్యం, అందిస్తున్న వైద్యంపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి భరోసా ఇచ్చారు. సుమారు గంటన్నర పాటు ప్రతి ఒక్క క్షతగాత్రుడు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధితులను అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు, మూడు వారాల్లో బాధితులకు పరిహారం అందించని పక్షంలో తాను ధర్నాలో కూర్చుంటానని హెచ్చరించారు.

అదే ప్రేమ.. అదే అభిమానం

బాధితులను పరామర్శించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లికి వచ్చారన్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా జన సందోహంతో నిండిపోయింది. జగనన్న.. జై జగన్ అంటూ పెద్ద ఎత్తున చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. ఒకవైపు జగన్‌కు జై కొడుతూనే.. మరోవైపు 'గోవింద.. గోవింద.. సూపర్ సిక్స్ గోవింద' అంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని ఎద్దేవా చేస్తూ నినదించారు. దీంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారిపోయింది. భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలను కట్టడి చేయడానికి పోలీసులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12.30 గంటలకు జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ కాన్వాయ్‌లో ఎక్కి బయలుదేరారు. అక్కడి నుంచి గాజువాక మింది ప్రాంతంలో ఉన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నివాసానికి వెళ్లి లంచ్ చేశారు. అనంతరం 1.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకొని విమానంలో తిరుగుపయనమయ్యారు.

ఈ పర్యటనలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ తనూజా రాణి, ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, పేర్ని నాని, ధర్మాన కృష్ణదాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎంపీలు భీశెట్టి వెంకట సత్యవతి, ఎంవీవీ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, కంబాల జోగులు, కన్నబాబురాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావ్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ముఖ్యనేతలు దంతులూరి దిలీప్‌కుమార్, కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ రీజనల్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



ఉషా ప్రైమ్ ఆస్పత్రి వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి







బాధితులకు ఓదార్పు

అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫార్మా ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

మృత్యు కుహరాలు

- ఫార్మా పరిశ్రమలో వరుస ప్రమాదాలు
- భద్రత ప్రమాణాలు పాటించని సంస్థలు
- చూసీచూడనట్టుగా అధికారులు

సాక్షి, అనకాపల్లి: ఫార్మా పరిశ్రమలు మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. 'పరవాడ–అచ్యుతాపురం' స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లో తరచుగా జరుగుతున్న ప్రమాదాలు భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించని సంస్థల వల్ల కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ సెజ్ పరిధిలో జూన్, జూలై, ఆగస్టులో జరిగిన 7 వరుస అగ్ని ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎంఎన్‌సీ స్థాయి పరిశ్రమల్లోనూ ప్రమాదాలు జరగడంతో పారిశ్రామిక భద్రతలో డొల్లతనం తరచూ బయటపడుతోంది. సాహితీ ఫార్మాలో అగ్ని ప్రమాదం నుంచి మూడు రోజుల కిందట ఎసైన్షియా ఫార్మా కంపెనీలో, ఈ రోజు జేఎన్ ఫార్మాసిటీలోని సినర్జిన్ సంస్థలో జరిగిన ప్రమాదం వరకు అన్నీ కార్మికులకు పీడకలగా మారాయి. పరిశ్రమల్లో నిర్వహణ లోపాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఏదో ఘోరం జరిగినప్పుడు తప్ప.. అధికార యంత్రాంగం పరిశ్రమలపై దృష్టి పెట్టిన సందర్భాలు ఉండడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన భద్రతా ప్రమాణాలను ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి పట్టించుకున్న దాఖలాలు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇప్పటి వరకు పరిశ్రమల భద్రతపై ఒక్కసారి కూడా సమీక్షించలేదు.



సెజ్‌లోనే ప్రమాదాలు ఎందుకంటే..?

ఉమ్మడి విశాఖలో అనేక ప్రాంతాల్లో పరిశ్రమలు ఉన్నప్పటికీ.. ప్రత్యేక ఆర్థిక మండలి జోన్లలో అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సెజ్, నాన్ సెజ్ పరిధిలో 19 అత్యంత ప్రమాదకర పరిశ్రమలు ఉండగా..192 ప్రమాదకరమైన పరిశ్రమలు, 56 రెడ్ కేటగిరీ పరిశ్రమలు, 82 ఔషధ పరిశ్రమలున్నాయి. ఈ కంపెనీల్లో దాదాపుగా 30 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు సరైన మానవవనరుల నియామకంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేక ప్రమాదాలు మానవ తప్పిదాల కారణంగానే సంభవించినట్లు అధికారుల నివేదికల ద్వారా వెల్లడైంది. వీటిని అరికట్టే విషయంపై అటు యాజమాన్యాలు గానీ, అధికార యంత్రాంగం గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పట్టించుకోని యంత్రాంగం

పరిశ్రమల్లో రక్షణ చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పరిశ్రమల్లో సేఫ్టీ అంశాలు, నిత్యం పరికరాల తనిఖీలు వట్టి మాటగానే మిగిలాయి. కేవలం ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేసే అధికారులు, నాయకులు అనంతరం ఇటువైపు చూడడం లేదు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. ఇటీవల పరిశ్రమలలో భద్రత, ప్రమాదాల నివారణ, రక్షణ అంశాలను జిల్లాకు చెందిన అధికారుల బృందాలు పరిశీలించి, పై అధికారులకు నివేదికలు ఇచ్చినా.. వరుసగా ప్రమాదాలు జరగడంతో పారిశ్రామిక రంగ భద్రతలో డొల్లతనమే కన్పిస్తోంది.

రక్షణ లేని జీవితాలు

ఫార్మా పరిశ్రమల్లో విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇళ్లకు చేరడం కష్టంగా మారింది. రసాయన పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు కూడా లేకపోవడం, శిక్షణ పొందిన ఫైర్ సిబ్బందిని నియమించకపోవడంతో అధిక ప్రమాదాలకు కారణమని చెప్పొచ్చు. ఇక్కడ నిపుణులైన కార్మికులను నియమించాల్సి ఉండగా కనీస అవగాహన లేని టెంపరరీ, కాంట్రాక్ట్ కార్మికుల చేత పనులు చేయిస్తున్నారు. వారు రియాక్టర్ల ఒత్తిడిని సరైన సమయంలో గుర్తించకపోవడం, కెమికల్ రియాక్షన్‌ను నివారించడంలో విఫలం కావడంతో పేలుళ్లు జరుగుతున్నాయి. చాలా పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన వెంటనే చికిత్స కోసం తరలించేందుకు సరైన అంబులెన్స్ లాంటి వాహన సౌకర్యాలు కూడా లేవు. పరిశ్రమల్లో వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం జరిగి అక్కడ నుంచి నగరానికి చేరేలోపు కార్మికులు మృత్యువాత పడుతున్నారు.

గుడివాడ ఇంట్లో జగన్


గుడివాడ అప్పలరామ్మూర్తిని పలకరిస్తున్న మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం 68వ వార్డు మిందిలోని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నివాసానికి విచ్చేశారు. అనకాపల్లి నుంచి తిరుగు ప్రయాణంలో వచ్చిన ఆయన గుడివాడ కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించారు. వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తితో ముచ్చటించారు. అమర్‌నాథ్ కుమార్తెలు జగన్‌మోహన్‌రెడ్డితో ఆప్యాయంగా మాట్లాడారు.

'ఫార్మా' బాధితులకు పరిహారం ప్రతిపాదన లేఖల అందజేత


నష్ట పరిహారపు ప్రతిపాదనల లేఖలు అందజేస్తున్న హోం శాఖ మంత్రి అనిత

అగనంపూడి: వడ్లపూడిలోని పవన్ సాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అచ్యుతాపురంలోని ఎసైన్షియా ఫార్మా కంపెనీ బాధిత కుటుంబాలను శుక్రవారం హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. ముందుగా బాధితులను ఓదార్చి, ఆ తర్వాత వారికి నష్టపరిహారం ప్రతిపాదనల లేఖలను అందజేశారు. ఇందులో ఇద్దరు బాధితులకు రూ.50 లక్షలు చొప్పున, ఆరుగురికి రూ.25 లక్షలు చొప్పున లేఖలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.కోటి అందజేశామని, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 లక్షలు, స్వల్పంగా గాయపడిన బాధితులకు రూ.25 లక్షలు వంతున అందిస్తున్నామన్నారు.

కేజీహెచ్ నుంచి 26 మంది చిన్నారుల డిశ్చార్జ్

ఇంకా 10 మందికి చికిత్స అందిస్తున్న వైద్యులు


డిశ్చార్జ్ అయిన పిల్లలతో కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, పిల్లల విభాగాధిపతి చక్రవర్తి

మహారాణిపేట: కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న పాసా ట్రస్ట్ ఆశ్రమ పిల్లలు శుక్రవారం డిశ్చార్జ్ అయ్యారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలోని పాసా ట్రస్ట్ ఆశ్రమంలో పిల్లలు విషాహారం తిని అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నెల 19 నుంచి కేజీహెచ్ పిల్లల వార్డులో 38 మంది పిల్లలకు చికిత్స అందిస్తున్నారు. కేజీహెచ్ సూపరింటెంటెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఇతర వైద్యులు వారికి సేవలందిస్తున్నారు. ఇందులో 26 మంది పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ చక్రవర్తి తెలిపారు. మిగిలిన 10 మందిలో 6 గురు ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు.

స్టీల్‌ప్లాంట్ అధికారులకు షోకాజ్ నోటీసులు

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ అధికారులు పలువురికి యాజమాన్యం శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. స్టీల్ ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో కాంట్రాక్ట్ పనులను ఆయా విభాగాలకు చెందిన వివిధ స్థాయిల అధికారులు పర్యవేక్షిస్తూ ఇంజినీర్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తుంటారు. వారు కాంట్రాక్ట్ పనుల నిర్వహణతో పాటు అటెండెన్స్, బిల్లింగ్ పనులు చూస్తుంటారు. కాంట్రాక్ట్ కార్మికులకు కూడా బయోమెట్రిక్ అమలు చేయడంతో వారి అటెండెన్స్ బయోమెట్రిక్ ఆధారంగా సర్టిఫై చేయాల్సి ఉంది. ఈ విషయంలోనే యాజమాన్యం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది. కాంట్రాక్ట్ కార్మికుల బిల్లింగ్‌లో అధికారులు నిర్లక్ష్యం, పక్షపాతంగా వ్యవహరించారంటూ నోటీసులో పేర్కొన్నారు.

ఈ విధంగా ప్లాంట్ మొత్తం సుమారు 250 మంది ఉన్నట్లు సమాచారం. నోటీసులను హెచ్‌ఆర్ అధికారులు ఆయా విభాగాధిపతులకు అందించాశారు. ఈ విషయం స్టీల్‌ప్లాంట్ అధికారుల్లో కలకలం రేపింది.

రక్షణ చట్టాలు అవసరం



వైద్యులకు సమాజంలో ఎంతో గౌరవం ఉంది. అటువంటి వైద్యులపై దాడులు చేయడం దారుణం. కేజీహెచ్‌కు రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో అనుమానిత వ్యక్తులెవరనీ లోపలకు రానివ్వకుండా చర్యలు తీసుకుంటున్నాం. వైద్యులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెయిన్ గేటు వద్ద నియంత్రణ ఉంటే వైద్యులకు ఇబ్బందులు ఉండవు. వైద్యుల ప్రాముఖ్యంపై అందరికీ అవగాహన కల్పించాలి.
– డాక్టర్ పి.శివానంద్, సూపరింటెండెంట్, కేజీహెచ్

ప్రత్యేక నిఘా ఉండాలి



విధి నిర్వహణలో ఉన్న వైద్యులకు సదుపాయాలతో పాటు ప్రత్యేక రక్షణ ఉండాలి. రాత్రి సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటేనే రోగులకు సేవలు అందించగలరు. ప్రస్తుతం ఆంధ్రా మెడికల్ కాలేజీ, ఇతర వసతి గృహాలకు బయట వ్యక్తులు రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించాం. దీని వల్ల మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి, కాలేజీకి బయట వక్తులు రాకుండా చర్యలు చేపట్టాలి. ప్రధానంగా మహిళా ఉద్యోగుల దగ్గర మహిళా భద్రత సిబ్బందినే ఉంచాలి. అప్పుడే మనిషికి మనిషి తోడు ఉన్నట్లు ఉంటుంది.
– డాక్టర్ జి.బుచ్చిరాజు, ప్రిన్సిపాల్, ఆంధ్రా మెడికల్ కాలేజీ

భద్రతపై దృష్టి సారించాలి



రాత్రుళ్లు విధులు నిర్వర్తించే వైద్యులకు పూర్తి భద్రత ఉండాలి. సరైన భద్రత లేకపోవడం వల్లే కోల్‌కతాలో వైద్యురాలిపై దాడి జరిగింది. ఇలాంటి సంఘటనలు దేశంలో మరెక్కడా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. గైనిక్, పిల్లల వార్డుల్లో ఎక్కువ మంది మహిళా వైద్యులు, సిబ్బంది ఉంటారు. రోగులకు సేవ చేయడానికి వైద్యులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారు. కానీ వారికి విధి నిర్వహణలో భద్రత చాలా ముఖ్యం. అన్ని రకాల సదుపాయాలు, భద్రత ఉంటే వైద్యులు సక్రమంగా వైద్యం అందించగలరు.
– డాక్టర్ టి.పృథ్వీరాజ్, జిల్లా అధ్యక్షుడు, ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్

ఏయూ బయోటెక్నాలజీ విద్యార్థుల ఘనత

ఎంవీపీకాలనీ: ఏయూ బయోటెక్నాలజీ విభాగం విద్యార్థులు బాలరోహిత సుందరం, లేఖన ఆకుల, మైథిలీ ఆకెళ్ల మూడు పేటెంట్లను నమోదు చేసి.. విశ్వవిద్యాలయ చరిత్రలో అద్భుత విజయం సాధించారు. టీకాప్స్–ఈ సారథ్యంలో కొంతకాలంగా వీరు పరిశోధనలు చేస్తున్నారు. ఏయూ చరిత్రలో ఒకే సారి 3 పేటెంట్లు నమోదు చేయడంపై వర్సిటీ వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి.

తాగునీటి వనరులకు పూర్వ వైభవం

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం

మహారాణిపేట: జిల్లాలోని సహజ తాగునీటి వనరుల సంరక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, వాటికి పూర్వ వైభవం తీసుకురావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి శుక్రవారం జిల్లాలోని తాగునీటి వనరుల సంరక్షణపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని సహజ సిద్ధ తాగునీటి వనరులు, మూల కేంద్రాలను, సరిహద్దులను గుర్తించేందుకు రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు సంయుక్తంగా రీ–సర్వే చేపట్టాలని ఆదేశించారు. సెప్టెంబర్ 30లోగా ఈ సర్వే పూర్తి చేసి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో తాగునీటి అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని, వనరులను కాపాడుకునేందుకు అన్ని విభాగాల అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 179 తాగునీటి వనరుల కేంద్రాలు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం ఉందని, రీ–సర్వేలో మరిన్ని వనరులు వెలుగులోకి రావచ్చని అంచనా వేశారు. సహజ సిద్ధ తాగునీటి వనరుల సంరక్షణలో ధన్ ఫౌండేషన్, స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా ధన్ ఫౌండేషన్ ప్రతినిధులు జిల్లాలోని తాగునీటి వనరులకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డ్వామా పీడీ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు తెలియకుండా భూ ఆక్రమణలు జరగవు

జిల్లాలోని దేవదాయ శాఖ, ప్రభుత్వ భూముల్లోని ఒక సెంటు కూడా ఆక్రమణ కావడానికి వీల్లేదని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన భూ పరిరక్షణ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులకు తెలియకుండా భూ ఆక్రమణలు జరగబోవని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో ఎలా ఉన్నప్పటికీ.. ప్రస్తుతం వాటిని ఆక్రమించకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న దేవదాయ శాఖ భూములను గుర్తించి, వాటికి సరిహద్దులను నిర్ణయించాలని ఆదేశించారు. ఆక్రమణలో ఉన్న భూములను సర్వే చేయించి, నోటీసులు జారీ చేయాలన్నారు. దేవదాయ శాఖ ఏసీ కె.శిరీష మాట్లాడుతూ జిల్లాలోని 11 ఆలయాలకు చెందిన భూములు ఆక్రమణలో ఉన్నాయని.. ఇప్పటికే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామన్నారు. సమావేశంలో ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, పలు ఆలయాల ఈవోలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

ఆందోళన విరమించిన జూడాలు

మహారాణిపేట: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడి, అనంతరం హత్య చేసిన ఘటనను నిరసిస్తూ 12 రోజులుగా ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు శుక్రవారం నుంచి విధులకు హాజరయ్యారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆందోళన విరమించినట్లు ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన వారికి కఠిన శిక్ష పడాలని, కేంద్ర ఆరోగ్య సిబ్బంది రక్షణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్సల నిర్వహణకు సహకరిస్తున్న జూనియర్ వైద్యురాలు

త్వరలో వీఎంఆర్డీఏ జోనల్ ఆఫీస్‌లు

విశాఖ సిటీ: పరిపాలన సౌలభ్యం కోసం త్వరలోనే అనకాపల్లి, విజయనగరం(చీపురుపల్లి), నర్సీపట్నం ప్రాంతాల్లో జోనల్ కార్యాలయాలను ప్రారంభిస్తామని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ చెప్పారు. శుక్రవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో ప్రణాళిక విభాగంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రణాళిక విభాగం పనితీరును సమీక్షించారు. సాంకేతిక ఉద్యోగులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల ఏపీడీపీఎంఎస్/ఈ–ఆఫీస్ పోర్టల్ వ్యక్తిగత లాగిన్‌లో పెండింగ్ ఉన్న దస్త్రాలపై ఆరా తీశారు. అవి ఏ దశలో ఉన్నాయని ప్రశ్నించారు. దస్త్రాలను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడానికి వీలులేదని, అనవసర షార్ట్ ఫాల్స్ నోటీసులు ఇచ్చి కాలయాపన చేయవద్దని చెప్పారు. లాగిన్‌లోని ఫైల్స్ కచ్చితంగా నిర్ణీత సమయానికి క్లియర్ చేయాలని ఆదేశించారు. ఎటువంటి పరిస్థితుల్లోను డీమ్డ్ అప్రూవల్ అవడానికి అవకాశం ఇవ్వకూడదన్నారు. అలసత్వం ప్రదర్శించే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు వెనుకాడనని హెచ్చరించారు. వీఎంఆర్డీఏ పరిధిలో అక్రమ భవన నిర్మాణాలు, అక్రమ లేఅవుట్ల నియంత్రణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అనధికార, సంబంధం లేని బయటి వ్యక్తులను సంస్థలోకి అనుమతించవద్దని ముఖ్య ప్రణాళికా అధికారిని ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్య ధోరణిని వీడాలని, లేదంటే బదిలీలు తప్పవన్నారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ రవీంద్ర, ముఖ్య ప్రణాళికా అధికారి సంజయ్ రత్న కుమార్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, ప్లానింగ్, పరిపాలనాధికారులు పాల్గొన్నారు.

మస్కట్ వెళ్లిన మహిళ జాడ లేదు

- భారత్‌కు రప్పించాలని ఆమె కుమార్తె వేడుకోలు

మల్కాపురం: 'విదేశాల్లో ఉద్యోగం పేరిట తన తల్లిని తీసుకెళ్లారు. నెలలు గడుస్తున్నా తన తల్లి నుంచి ఎటువంటి సమాచారం లేదు'అని మల్కాపురం పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం ఆమె కుమార్తె, కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన భవాని అనే మహిళ మస్కట్‌లో ఉపాధి నిమిత్తం లక్ష్మి అనే ఏజెంట్‌కు కొంత నగదు చెల్లించారు. కొన్ని నెలల కిందట ఆమెను మస్కట్ తీసుకెళ్లారు. నెలలు గడుస్తున్నప్పటికీ భవాని నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో కలవరపడిన ఆమె కుమార్తె, కుటుంబ సభ్యులు ఏజెంట్‌ను కలిసి నిలదీశారు. తన తల్లి సమాచారం ఇవ్వాలని ప్రాధేయపడ్డారు. ఫలితం లేకపోవడంతో మరో ఏజెంట్ రజినీకాంత్‌ను కలిశారు. రూ.70 వేలు అందించి తన తల్లిని రప్పించాలని వేడుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో వారం కిందట మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆమె కుమార్తె, కుటుంబ సభ్యులు శుక్రవారం మల్కాపురం స్టేషన్‌కు మళ్లీ వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తన తల్లిని ఇండియాకు రప్పించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు

నేటి నుంచి సాగర్‌నగర్ ఇస్కాన్‌లో..



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షుడు సాంబాదాస్

డాబాగార్డెన్స్: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు విశాఖ నగర శాఖ అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీ నితాయ్ సేవిని తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 24, 25 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు మాయాపూర్ భక్త బృందంచే హరే కృష్ణ మహా మంత్ర సంకీర్తన, సాంబదాస్‌చే ప్రవచనం, 26న సాయంత్రం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు చిన్నారులచే వేషధారణ, ఉట్టి కొట్టే సంబరం, సోలో, గ్రూపు డ్యాన్స్ పోటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 26న రాత్రి 11 గంటలకు మందిరంలో బాలకృష్ణుడికి మహాభిషేకం, 108 దీపాలతో అఖండ మంగళ హారతి, భక్తులకు ప్రసాద వితరణ, 27న ప్రభుపాదుల మూర్తికి నందనోత్సవం, అభిషేకం, దివ్య హారతి ఉంటుందన్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొనే వారు 89789 71415లో సంప్రదించవచ్చు. సమావేశంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, బీహెచ్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

రేపటి నుంచి గాదిరాజు ప్యాలస్‌లో..



వివరాలు వెల్లడిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి శ్యామా మాధవ దాస

డాబాగార్డెన్స్: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు మూవ్‌మెంట్ ప్రతినిధి శ్యామా మాధవదాస తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంవీపీకాలనీలోని గాదిరాజు ప్యాలస్ వేదికగా ఈ నెల 25, 26 తేదీల్లో, గంభీరంలో 25, 26, 27 తేదీల్లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హరేకృష్ణ వైకుంఠం(గంభీరం)లో 108 మంది ప్రసిద్ధ సంగీత కళాకారులచే సామూహిక భజ గోవిందం కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రఖ్యాత కళాకారులు ద్వారం త్యాగరాజ్ బృందం, చైతన్య బ్రదర్స్, శారదా సుబ్రహ్మణ్యం, పోలుపల్లి సత్యనారాయణమూర్తి, సోమయాజులు, విష్ణు ప్రియా ఇందిరా, డాక్టర్ సరస్వతి, హరితా సిస్టర్స్, డాక్టర్ మండపాక శారదచే సంగీత కచేరీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉట్టి మహోత్సవం, కృష్ణుడితో సెల్ఫీ, రెండు వేర్వేరు చిత్రాల తేడాలు గుర్తించడం, కృష్ణుడు ఎవరు అనే అంశంపై 10 ప్రశ్నలకు పరీక్ష తదితర పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు యదురాజ దాసను 90106 11108లో సంప్రదించవచ్చు.

దుమ్ము రేపుతున్న 'కమిటీ కుర్రోళ్లు'

- నిర్మాత నిహారిక

డాబాగార్డెన్స్: జగదాంబలోని శ్రీ వెంకటేశ్వర థియేటర్‌లో శుక్రవారం 'కమిటీ కుర్రోళ్లు' సినిమా యూనిట్ సందడి చేసింది. చిత్ర నిర్మాత నిహారిక కొణిదెల, నటీనటులు పాల్గొని ప్రేక్షకులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ ఈ సినిమా పెద్ద విజయం సాధించిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో జాతర బ్యాక్‌డ్రాప్‌తో కథ నడుస్తుందని, భావోద్వేగాలు, డ్రామాతో ప్రేక్షకులను అలరిస్తోందన్నారు. విశాఖతో తనకు మంచి అనుబంధం ఉందని, తర్వాత సినిమాను విశాఖలోనే చేస్తామన్నారు. విశాఖకు చెందిన ప్రసాద్, సందీప్, రుషిక తదితరులు ఇందులో నటించారని చెప్పారు. దర్శకుడు యదువంశీ మాట్లాడుతూ మూడో వారం కూడా సినిమా మంచి కలెక్షన్లతో ఆడుతుండటం ఆనందంగా ఉందన్నారు. నటుడు ప్రసాద్ మాట్లాడుతూ తాను ఇందులో పెద్దోడు పాత్ర చేశానన్నా రు. నటులు సందీప్, సరోజ్, దీపక్ మాట్లాడిన కార్యక్రమంలో కో–ప్రొడ్యూసర్ ఫణి, థియేటర్ మేనేజర్ నరసింహారావు, పూర్వీ పిక్చర్స్ ప్రతినిధి పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సంగీత నృత్యోత్సవాలు




నృత్యోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీఎండీఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(వీఎండీఏ) 38వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం నుంచి ఆరు రోజుల పాటు జాతీయ నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ అధ్యక్షుడు ఎం.ఎస్.రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ఈ కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ఏడాది వార్షికోత్సవాల్లో భాగంగా జాతీయ పురస్కారంతోపాటు లక్ష రూపాయల నగదు, రూ.2 లక్షల విలువ చేసే స్వర్ణ కమలం, ప్రతిష్టాత్మకమైన నాద విద్యా భారతి బిరుదును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్.ఎ.కె.సి.నటరాజన్‌కు శనివారం జాతీయ పురస్కారం అందజేస్తామన్నారు. అనంతరం నటరాజన్ క్లారినెట్ కాన్సర్ట్‌తో అలరించనున్నారు. రెండవ రోజు ముంబయికి చెందిన విద్వాన్మణి మీటపండిట్ హిందూస్థానీ గాత్ర కచేరి, మూడవ రోజు కృష్ణాష్టమి నాడు ప్రపంచ ప్రఖ్యాత ఈల పాట విద్వాంసులు శివప్రసాద్ పాట కచేరీ, నాలుగో రోజు చెన్నైకి చెందిన ఒ.ఎస్. అరుణ్‌చే సంప్రదాయ కచేరీ, ఐదో రోజు వేదాంతం రామలింగశాస్త్రి శిష్యులు భక్తప్రహ్లాద కూచిపూడి నృత్య రూపకం, చివరి రోజు తిరుపతికి చెందిన పౌరాణిక పద్య నాటక సంస్థచే 36 మంది కళాకారులతో నర్తనశాల ప్రదర్శన ఉంటుందున్నారు. కార్యక్రమంలో వీఎండీఏ ప్రతినిధి పైడా కృష్ణ ప్రసాద్, గ్రంధి మల్లికా మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై చంద్రబాబు వైఖరి ఏంటి?

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



మాట్లాడుతున్న చింతామోహన్

సీతమ్మధార : ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సీఎం చంద్రబాబునాయుడు వైఖరి స్పష్టం చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులో రాజ్యాంగస్ఫూర్తి లేదని విచారం వ్యక్తం చేశారు. క్రీమీలేయర్ అంటున్న 34 మంది సుప్రీంకోర్టు జడ్జిలలో 20 మంది ఒకే అగ్రవర్ణం వారన్నారు. జడ్జీలలో వర్గీకరణ అవసరం లేదా? అని ప్రశ్నించారు. 2028 నాటికి కేంద్రం అన్ని రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర చేస్తుందని ధ్వజమెత్తారు. అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం ప్రాజెక్టు అని, దివంగత మహానేత వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు, జగన్ హయాంలో చేసిన ఖర్చు వివరాలను బహిర్గతం చేయాలని చింతామోహన్ డిమాండ్ చేశారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మధురవాడ : కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ)లో 2024–25 విద్యా సంవత్సరంలో మిగిలిన ఎస్సీ, ఎస్టీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.నాగమణి తెలిపారు. 5వ తరగతిలో 16 సీట్లు, 6వ తరగతిలో 14 సీట్లు, 7వ తరగతిలో 15 సీట్లు, 9వ తరగతిలో 6 సీట్లు, ఇంటర్ బైపీసీలో 5 సీట్లు, ఎంపీసీలో 20 సీట్లు ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మ్యాట్రిమోనీ ద్వారా సైబర్ నేరాలు.. ఇద్దరు అరెస్ట్

విశాఖ సిటీ: జీవన్‌సాథీ.కామ్ ద్వారా పెళ్లి కాని యువకులను పరిచయం చేసుకొని ఎమోషనల్‌గా లోబర్చుకొని క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెట్టించి డబ్బులు కాజేస్తున్న కేసులో ఇద్దరిని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు జీవన్‌సాథీ.కామ్ నుంచి అమ్మాయి పేరుతో రిక్వెస్ట్ వచ్చింది. తరువాత అతడి వాట్సాప్ నెంబర్ తీసుకొని అందమైన అమ్మాయిల ఫొటోలు పెట్టి ఛాటింగ్ చేశారు. ఎమోషనల్‌గా దగ్గరైనట్లు మెసేజ్‌లు పెట్టి.. తనకు క్రిప్టో కరెన్సీలో ట్రేడింగ్‌లో భారీగా లాభాలు వస్తున్నాయని నమ్మించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను కూడా పెట్టుబడి పెట్టాలని చెప్పడంతో ఆకర్షణ కారణంగా యూఎస్‌డీటీలో సుమారు రూ.46.6 లక్షలు వ్యాపారం చేశాడు. ఆ డబ్బు తిరిగి రాకపోవడంతో మోసపోయాడని గ్రహించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత సహాయంతో ఇప్పటికే రాజమండ్రికి చెందిన కటారి జగన్‌మోహన్‌రావును అరెస్టు చేశారు. కేసును మరింత దర్యాప్తు చేయగా.. నేరస్తులకు అకౌంట్స్ సప్లయ్ చేస్తున్న వెస్ట్‌బెంగాల్‌కు చెందిన ఆదిత్య పాత్ర, రూపం సోంలను గుర్తించి వారిని అక్కడి నుంచి ట్రాన్సిట్ వారెంట్‌పై విశాఖకు తీసుకువచ్చి శుక్రవారం రిమాండ్‌కు పంపించారు. కేసు విచారణలో ముద్దాయిలపై దేశంలో అనేక రాష్ట్రాల్లో 106 కేసులు నమదైనట్లు గుర్తించారు.

యాజమాన్యాల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

- సినర్జిన్ యాక్టివ్ క్షతగాత్రులకు హోంమంత్రి పరామర్శ
- ప్రమాదంలో పరిశ్రమ తప్పిదం లేదు: ఎంపీ రమేష్



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి అనిత

డాబాగార్డెన్స్: అనకాపల్లి జిల్లా జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్ గ్రేడియంట్స్‌లో గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కార్మికులను శుక్రవారం హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పరామర్శించారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయనగరం జిల్లాకు చెందిన సీనియర్ కెమిస్ట్ సూర్యనారాయణ, హెల్పర్లు జార్ఖండ్‌కు చెందిన ఒ.ఎ.భాను కోర, లాల్‌సింగ్ పూర్తీ, రొయ్యన్ అంజిరియా ఆరోగ్య పరిస్థితిని వైద్యులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ రసాయనాలు కలిపేటప్పుడు ఈ ప్రమాదం జరిగిందని, ఈ ఘటన దురదృష్టకరమన్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యం వల్లే పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, ఓ కమిటీ వేసి పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తామన్నారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ ఈ ప్రమాదం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో జరిగిందని, కానీ తమకు ఉదయం 6 గంటలకు సమాచారం వచ్చిందన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రితో పాటు మంత్రులకు సమాచారమిచ్చామని, పరిశ్రమల్లో జరుగుతున్న ఘటనలకు సంబంధించి అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారన్నారు. పరిశ్రమల్లో తాత్కాలికంగా ఉత్పత్తులు నిలిపివేయాలని, అన్ని భద్రతా చర్యలు, జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే ఉత్పత్తులు ప్రారంభించాలని సూచించారు. ఘటన జరిగిన తీరును చూస్తే.. ఇది ఏమాత్రం ప్లాంట్ తప్పిదం కాదన్నారు. కాగా.. ఈ ప్రమాదంపై హోం శాఖ మంత్రి, ఎంపీ విరుద్ధ ప్రకటనలు చేయడం గమనార్హం.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.115
స్కిన్	: రూ.200
స్కిన్‌లెస్	: రూ.210

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,650
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,600
వెండి(కిలో):	రూ.91,700